ఖరీఫ్ సాగు అంతంతే!

- వేరుశనగ సాగుకు పెరుగుతున్న పెట్టుబడి
- వెంటాడుతున్న ప్రకృతి వైపరీత్యాలు
- పడిపోతున్న పంట దిగుబడి, గిట్టుబాటు ధరలు
- బీళ్లుగా వ్యవసాయ భూములు



తాడిమర్రిలో బీడుగా మారిన వ్యవసాయ భూమి

తాడిమర్రి: ధర్మవరం నియోజకవర్గంలో వేరుశనగ సాగు అంతంత మాత్రంగానే సాగవుతోంది. పెరుగుతున్న పెట్టుబడి, వెంటాడుతున్న ప్రకృతి వైపరీత్యాలు, పడిపోతున్న పంట దిగుబడులు, గిట్టుబాటు ధరలు వెరసీ వేరుశనగ పంట సాగు తగ్గిపోతోంది. దీంతో వ్యవసాయ భూములు బీళ్లుగా మారుతున్నాయి. గతంలో ఖరీఫ్ సీజన్ వచ్చిందంటే మే నెల ప్రారంభం కాగానే తొలకరి జల్లులు, వర్షాలు కురవడంతో పొలాలకు సేంద్రీయ ఎరువులు తోలడం, వ్యవసాయం చేయడం, జూన్ నెల నుంచి జూలై వరకు విత్తనం వేయడం, ఆగస్టు, సెప్టెంబర్‌లో కలుపు తీయడం, అక్టోబర్, నవంబర్ నెలల్లో పంట కోతలు ప్రారంభం ఇలా వ్యవసాయ పనులతో గ్రామాల్లో ప్రజలు ఎంతో బిజీ,బిజీగా గడిపేవారు. పొలాల్లో ఎక్కడ చూసినా రైతులు, కూలీలు ఏదో ఒక పని చేస్తూ కనిపించేవారు. ప్రస్తుతం అలాంటి దృశ్యాలు పొలాల్లో మచ్చుకైనా కనిపించడం లేదు.

తగ్గిపోతున్న సాగు విస్తీర్ణం..

ధర్మవరం నియోజక వర్గంలో తాడిమర్రి మండలంలో 5,708 హెక్టార్లు సాధారణ వేరుశనగ సాగు విస్తీర్ణం కాగా గతేడాది కేవలం 1,390 హెక్టార్లలో మాత్రమే రైతులు వేరుశనగ సాగు చేశారు. అలాగే బత్తలపల్లి మండలంలో 6,530 సాధారణ విస్తీర్ణం కాగా 3,435 హెక్టార్లు, ముదిగుబ్బ మండలం 11,849 హెక్టార్లు కాగా 5,272 హెక్టార్లు, ధర్మవరం సాధారణ వేరుశనగ సాగు విస్తీర్ణం 10,172 హెక్టార్లు కాగా గత ఏడాది కేవలం 5,600 హెక్టార్లు మాత్రమే విత్తనం వేశారు.

కనిపించని వరుణుడి జాడ..

ఈ ఏడాది ధర్మవరం, బత్తలపల్లి మండలాల్లో మే మొదటి వారం వరకు నాలుగు పదున్ల వర్షం కురవగా తీరా పంట సాగు సమయం వచ్చే సరికి వరుణుడి జాడ కనిపించలేదు. ఇక తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లో మే మొదటి వారంలో ఒకేఒక్క పదును వాన కురిసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు చిరు జల్లులు తప్ప వర్షం కురిసిన దాఖలాలు లేవు. దీంతో ఈ ఏడాది వేరుశనగ సాగు విస్తీర్ణం మరింత పడిపోయేట్లు కనిపిస్తున్నారు. గ్రామాల్లోని పొలాలు ఎక్కడ చూసినా బీడుగా దర్శనమిస్తున్నాయి.

పెట్టుబడులు అధికమయ్యాయి



వేరుశనగ పంట సాగులో వ్యవసాయ ఖర్చులు అధికంగా పెరిగాయి. సేద్యాలు చేయించడానికి గతంలో ట్రాక్టర్ బాడుగ గంటకు రూ.800 నుంచి రూ.900 ఉండగా ఇప్పుడు రూ.1,100, రూ.1200 ఉంటోంది. గతంలో వంద కిలోల విత్తనం రూ.10 వేలు, రూ.11 వేలు ఉండగా ప్రస్తుతం రూ.13 వేలు, రూ.14 వేలు పలుకుతున్నాయి. అలాగే పంటకు వేసే కాంప్లెక్స్ ఎరువులు పెరిగాయి. ఒక ఎకరాకు సుమారు రూ.30 వేలు ఖర్చుచేసి పంట సాగు చేస్తే పంట దిగుబడి కనీసం 8 బస్తాలు కావడం లేదు. రైతులు వేరుశనగ సాగుతో నష్టపోతున్నారు.

– ఉప్పలూరు కేశవరెడ్డి, రైతు, మద్దులచెర్వు, తాడిమర్రి

వేరుశనగ నష్టాలు మిగుల్చుతోంది



ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంట సాగు చేయడంతో ఏటా నష్టాలను మిగిల్చుతోంది. సేద్యం, విత్తనం, ఎరువులు తదితర వాటికి వేలాది రూపాయలు ఖర్చుచేసి వేరుశనగ పంట సాగు చే స్తే చివరకు అప్పులు మిగులు తున్నాయి. వర్షాభావ పరిస్థితులు, పంటను ఆశించే చీడపీడలతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వేరుశనగ సాగు చేయడం అంటే కత్తి మీద సాము లాంటిది. మరోవైపు ప్రభుత్వ సాయం అందకపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

– వై.శంకర్‌రెడ్డి, రైతు, శివంపల్లి, తాడిమర్రి

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం



ప్రత్యేక అలంకరణలో ఖాద్రీశుడు



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఆర్డీఓ దంపతులు

కదిరి టౌన్: స్థానిక ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని రంగ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత వసంత వల్లభుడి కల్యాణం వైభవంగా జరిగింది. అర్చకులు కుమార్‌స్వామి, మోహన్ స్వామి ఖాద్రీశునికి ప్రత్యేక అలంకరణ చేసి నూతన వస్త్ర అలంకరణ చేసి వేద మంత్రోచ్చారణల నడుమ సంప్రదాయ పద్ధతులతో కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు స్వామివారికి పెళ్లి కానుకలు సమర్పించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వి.వి.ఎస్.శర్మ కుటుంబ సభ్యులు, కర్ణాటక భక్తులు పాల్గొన్నారు.

27 నుంచి ఖాశీంస్వామి ఉత్సవాలు



బత్తలపల్లిలోని బొప్పేపల్లి ఖాశీంస్వామి(ఫైల్)

బత్తలపల్లి: మండల కేంద్రంలో బొప్పేపల్లి ఖాసీం స్వామి(మొహర్రం) ఉత్సవాలు ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్నట్లు గ్రామపెద్దలు ఆదివారం తెలిపారు. తొలిరోజులు గుద్దులు, 28 కొలువుదీర్చుతామని, 2న ఐదో సరిగెత్తు, 3న నిత్యపూజ నివేదన, 4వ తేదీ చిన్నసరిగెత్తు(పానకాలు) నిర్వహిస్తామన్నారు. అదే రోజు రాత్రికి హిందువులు, పక్కీరుబాబాలుగా దీక్ష చేపడతారన్నారు. 5వ తేదీ ఉదయం గ్రామోత్సవం అనంతరం పీర్లు గంటాపురం, వేల్పుమడుగు, పోట్లమర్రి గ్రామాలకు వెళ్లి ఆ గ్రామాల్లో నిలిపిన పీర్లచావిడి వద్ద పీర్లు పూజలందుకుంటాయన్నారు. 6న పెద్ద సరిగెత్తు (పెద్దపానకాలు), 7వ తేదీ ఉదయం పీర్ల గ్రామోత్సవంలో భాగంగా బత్తలపల్లి కూడలికి వస్తాయని తెలిపారు. భేటీల అనంతరం అదేరోజు సాయంత్రం పీర్లు అగ్నిగుండ ప్రవేశం చేసి జలధికి వెళతాయన్నారు. 9న జార్తల్(దినాలు) నిర్వహిస్తామని వివరించారు. ఇదిలా ఉండగా మొహర్రం ఉత్సవాలపై ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్, ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, బత్తలపల్లి ఎస్‌ఐ సోమశేఖర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని మండల ప్రజలకు సూచించారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్

బత్తలపల్లి: ఎన్నికల హామీ మేరకు సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమతం కాటమయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మాల్యవంతం కుళ్లాయప్ప, సీపీఐ మండల కార్యదర్శి బండల వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సీపీఐ మండల మహాసభలకు హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో అనేక సమస్యలుంటే ప్రభుత్వం యోగాంధ్ర పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృథా చేస్తోందని విమర్శించారు. జిల్లాలో నెలకొల్పుతున్న కియా, సోలార్ పరిశ్రమలలో స్థానికులకు 80 శాతం ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ నేటికి అమలుకు నోచుకోలేదన్నారు. ఆయా పరిశ్రమలలో రాష్ట్ర, జిల్లా ప్రజలకు కాకుండా ప్రక్క రాష్ట్రాల ప్రజలకు అవకాశాలు కలిప్తున్నారని ధ్వజమెత్తారు. ప్రధాని నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షా ద్వయం దేశ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెడుతున్నారని విమర్శించారు. సీపీఐ ధర్మవరం నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు రామకృష్ణ మాట్లాడారు. ముదిగుబ్బ సీపీఐ కార్యదర్శి చల్లా శ్రీనివాసులునాయుడు, రమణ, బత్తల నాగభూషణ, వడ్డె సన్నపెద్దన్న, సత్యమయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను అమలు చేయాలి



శ్రామిక సర్వే నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

తనకల్లు: కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని చిన్నచెరువుపల్లిలో ఆదివారం శ్రామిక సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ కార్మికులు, కర్షకులు, పేద, మధ్య తరగతి రైతులు, వ్యవసాయ కార్మికులకు స్థానికంగా పనులు లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వలస బాట పట్టారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాల డైరీలను ఏర్పాటు చేయాలని, పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం బ్యాంకులు షూరిటీ లేని రుణాలను మంజూరు చేయాలన్నారు. ఉపాధి హామీ పనులను 200 రోజులకు పెంచి, కనీసం వేతనం రూ. 600 ఇవ్వాలని పేర్కొన్నారు. నాయకులు శివన్న, ఒంటిద్దు వేమన్న, రైతు సంఘం చలపతి, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు శ్రీనివాసులు, అంగన్‌వాడీ కార్యకర్త నాగలక్ష్మీ, మంజుల, మనోహర్, అమర్‌నాథ్, కుమార్ పాల్గొన్నారు.

వడ్డెర హక్కుల సాధనకు కృషి

అమడగూరు: వడ్డెర హక్కుల సాధనకు కృషి చేస్తానని వడ్డెర సంఘం మండలాధ్యక్షుడు దొనకొండ రమణప్ప పేర్కొన్నారు. ఆదివారం అమడగూరులో మండల వడ్డెర సంఘం కమిటీని నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రమణప్ప, గౌరవాధ్యక్షుడుగా అమరనాథ్, ఉపాధ్యక్షులుగా ఇడగొట్టు వెంకటరమణ, శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా తిరుపాల్, ప్రచార కార్యదర్శిగా జయరాం, కార్యదర్శిగా రవీంద్ర, కోశాధికారిగా రాము, సహాయ కార్యదర్శిగా రామప్ప, కమిటీ సభ్యులుగా సోమశేఖర్, నాగార్జున, లక్ష్మన్న, జయచంద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎంపికైన అధ్యక్షుడు రమణప్ప మాట్లాడుతూ వడ్డెర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మండల కేంద్రంలో నూతనంగా వడ్డె ఓబన్న విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఇతర రాష్ట్రాల మాదిరిగా వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చడానికి కృషి చేస్తామన్నారు.

సిద్ధేశ్వరస్వామికి పూజలు

అమరాపురం: హేమావతిలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సెలవు దినం కావడంతో మడకశిర నియోజకవర్గం నుంచే కాక సమీప కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

సాగు పట్టాలు పంపిణీ చేయాలి

సోమందేపల్లి: పందిపర్తి గ్రామంలోని సర్వే నంబరు 384కు సంబంధించి భూములు సాగు చేస్తున్న రైతులకు పట్టాలు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న డిమాండ్ చేశారు. ఆదివారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఇంటిపట్టాలు కూడా మంజూరు చేయాలని సోమందేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీపీఎం నాయకులు హనుమయ్య, కిష్టప్ప, స్వర్ణలత, గోవిందప్ప పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేతలు

ధర్మవరం అర్బన్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సత్యసాయి జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి మంత్రి సత్యకుమార్‌ను కోరారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఎన్డీఏ కార్యాలయంలో మంత్రికి సచివాలయ ఉద్యోగులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల్లో ఆరేళ్ల పూర్తి చేసుకున్న ఉద్యోగులందరికీ ప్రమోషన్ ఇచ్చిన అనంతరం బదిలీ చేయాలన్నారు.అన్ని శాఖల ఉద్యోగులకు ఇప్పటికి ప్రమోషన్స్ ఛానెల్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రొబేషన్ సమయంలో 9 నెలలు అధికంగా సర్వీస్ చేసిన కాలానికి వెంటనే అరియర్స్ మంజూరు చేయాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఏ కేటగిరి కింద వస్తున్నారో స్పష్టత ఇవ్వాలన్నారు. రెండేళ్ల ప్రొబేషన్ కాలానికి రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్నారు. డిగ్రీ అర్హతతో ఉద్యోగాలు పొందిన జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ వెంటనే అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, సభ్యుడు ఆదినారాయణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విరిగిపడిన విద్యుత్ స్తంభం



సానిపల్లిలో గాలి ధాటికి విరిగి పడిన విద్యుత్ స్తంభం

రొద్దం: మండల పరిధిలోని సానిపల్లిలో ఆదివారం సాయంత్రం వీచిన గాలివానకు ఎస్సీ కాలనీ వద్ద విద్యుత్ స్తంభం విరిగి పడిపోయింది. ఒక్కసారి పెద్ద ఎత్తున గాలులు వీచడంతో పెద్ద వేపమాను చెట్టు కూడా పడిపోయిందని గ్రామస్తులు తెలిపారు. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు.

ఆలయంలో దొంగతనం

రొద్దం: మండల పరిధిలోని నారనాగేపల్లి గ్రామ సమీపంలోని అప్పాజిపల్లికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన వెలసిన వీరచిన్నయ్యస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీలోని కానుకలను శనివారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. ఆలయ నిర్వాహకులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. హుండీలో రూ .10 వేల నుంచి రూ. 20 వేలు ఉండవచ్చన్నారు. దుండగులు ముఖాలకు ముసుగులు ధరించి చోరీ చేసినట్లు సీసీ కెమెరాలో రికార్డు అయిందన్నారు. చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'అపూర్వ' సమ్మేళనం



పూర్వ విద్యార్థులందరూ కలిసిన దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎంజీఎం ఉన్నత పాఠశాలలో 1986–1987లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. పాఠశాలలో చేసిన అల్లరిని, ఆట, పాటలను, మధుర స్మృతులను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. ప్రస్తుతం చేస్తున్న వృత్తులను, కుటుంబ సభ్యుల వివరాలను, యోగక్షేమాల గురించి మాట్లాడుకున్నారు. తమ బ్యాచ్‌కు చెందిన ఎంతో వివిధ ఉన్నతస్థానాల్లో ఉన్నారని హర్షం వ్యక్తం చేశారు. అలాగే ఈ బ్యాచ్‌కు చెందిన ప్రస్తుత మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్‌ను సన్మానించారు. అనంతరం పట్టణంలోని రూప వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బాలాజీ, ఎస్‌డీజీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్ర, సైంటిస్ట్ శ్రీనివాసులు, నరసింహులు, ఉక్కలప్ప, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుకు గాయాలు



ప్రమాదానికి కారణమైన కారు

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పెనుకొండ వైపు ద్విచక్ర వాహనంలో హోంగార్డు బ్రహ్మానందరెడ్డి తన కుమార్తెతో పాటు వెళుతుండగా కారు ఢీకొంది. ఇద్దరికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం పోలీసులు ఆస్పత్రికి తరలించారు. అదే కారు చెట్టుకు ఢీ కొని ఆగిపోయింది. మద్యం మత్తులో కారు నడపడంతో ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై అక్కడున్న వారు చేయి చేసుకున్నారు.

క్లుప్తంగా

సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాట



నినాదాలు చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

ధర్మవరం అర్బన్ : కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సమ్మెబాట పట్టాల్సి వస్తోందని మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక సంఘం అధ్యక్షుడు బొగ్గు నాగరాజు, ప్రధాన కార్యదర్శి జయకృష్ణ తెలిపారు. పట్టణంలో ఆదివారం సీఐటీయూ, ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్మికుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీఓ 36ను అమలు చేయాలని, కనీస వేతనం రూ.24500లు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఇంజినీరింగ్ కార్మికులకు ప్రభుత్వ ధకాలను అమలు చేయాలని తెలిపారు. ఈనెల 25 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులంతా సమ్మె చేపట్టనున్నట్లు ప్రకటించారు.

అనారోగ్యంతో కంప్యూటర్ ఆపరేటర్ మృతి



పి.బషీర్(ఫైల్)

గాండ్లపెంట: ఎన్పీకుంట మండల విద్యాధికారి కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేసే పి.బషీర్(36) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడు గత కొన్ని రోజులుగా కాలేయవ్యాధితో బాధపడుతున్నాడు. పరిస్థితి విషమించడంతో అతడిని కుటుంబ సభ్యులు బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక అక్కడే మృతి చెందాడని బంధువులు తెలిపారు. మృతునికి భార్య, కుమరుడు, కుమార్తె ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యులకు ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి, సహచర సిబ్బంది, ఉపాధ్యాయులు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.


ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్

పుట్టపర్తి టౌన్: ఎమ్మార్పీస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని జూలై 7న వాడవాడలా ఘనంగా నిర్వహిద్దామని రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని సాయి ఆరామంలో నియోజకవర్గం స్థాయి ఎమ్మార్పీఎస్ నాయకులు , కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి సురేష్ మాదిగ, ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బేకరీ గంగాధర్ హాజరై మాట్లాడారు. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మూడు దశాబ్దాల పాటు ఉద్యమం నడిపి ఎస్సీ వర్గీకరణ సాధించామన్నారు. వర్గీకరణ విజయాలు ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని తెలిపారు. ఎమ్మార్పీస్ నాయకులు మున్సిపల్ వైస్ చైర్మన్ తిప్పన్న, ఎస్టీడీ నరసింహులు, ఫొటోసాయి, పైపల్లి నరశింహులు, బండ్లపల్లి నరసింహులు, నాగభూషణ, కత్తి ఆనంద్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల ప్రదర్శన



అన్నమయ్య కీర్తనకు ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు

పుట్టపర్తి టౌన్: పట్టణంలోని శిల్పారామంలో చిన్నారులు తమ ప్రదర్శనలతో అలరించారు. శిల్పారామంలో ఆదివారం ఆహ్లాదం కార్యక్రమాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఈసందర్భంగా హైదరాబాద్‌కు చెందిన రేణుక ప్రభాకర్ బృందం జాతీయభావాన్ని పెంపొందించే దేశభక్తి గేయాలకు డ్యాన్స్ చేశారు. అన్నమయ్య కీర్తనలకు లయబద్ధంగా చేసిన నాట్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో శిల్పారామం ఏఓ ఖాదర్‌వలి, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ముదిగుబ్బ: మండల కేంద్రం సమీపంలోని నాలుగు మోరీల వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పట్టణంలోని కుటాగుళ్లకు చెందిన బాబ్‌జాన్, మహమ్మద్ రఫీ ఆటోలో వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

'యువత పోరు'కు తరలిరండి

చెన్నేకొత్తపల్లి: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పుట్టపర్తిలో జరిగే యువత పోరు నిరసన కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని పార్టీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం మోసపూరితమైన హామీలను ఇచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందన్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు పుట్టపర్తిలోని కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకోవాలని సూచించారు.

రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదేశాల మేరకు పుట్టపర్తిలో జరిగే యువత పోరుకు మండలం నుండి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,అభిమానులు, కార్యకకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కన్వీనర్ సూచించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

తలుపుల : మండల కేంద్రంలోని ఉబ్బరవాండ్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1985–86 బ్యాచ్ 10 వతరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా వారు గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు బి.ఓబులరెడ్డి దంపతులు, పి.జయరామిరెడ్డి, సైన్స్ టీచర్ బి.ఓబులరెడ్డిని దుశ్శాలువలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. అనంతరం నిగ్గిడి కనుమలో గల దొమ్మరమ్మ వద్ద విందు భోజనాలు ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులు భారతి, శ్రీదేవి, లక్ష్మిదేవి,విజయ నిర్మల, బ్రహ్మానందరెడ్డి, రామమోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రెడ్డిశేఖర్‌నాయుడు, కృష్ణమోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు అందుకున్న చౌడేశ్వరి అమ్మవారు

తాడిమర్రి: పెద్దకోట్ల గ్రామంలోని చౌడేశ్వరి అమ్మవారు ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి అమ్మవారి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పలు రకాల పుష్పమాలలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అధిక సంఖ్యలో భక్తులు ఆలయ ప్రదక్షిణలు చేసి, అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ పూజారి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

నల్లచెరువు: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు తెలిపిన వివరాలు..ఎం.అగ్రహారం పంచాయతీలోని ఎస్సీ కాలనీకి చెందిన రమణ కుటుంబ కలహాల నేపథ్యంలో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఆదివారం ఉదయం విషద్రావకం సేవించి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచనల మేరకు అనంతపురం తీసుకెళ్లారు.

24, 25 తేదీల్లో నీటి సరఫరా బంద్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కదిరిగేటు వద్ద రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పైప్‌లైన్ మార్చేందుకు ఈనెల 24, 25 తేదీల్లో నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఆదివారం తెలిపారు. పట్టణంలోని నేసేపేట, పీఆర్‌టీ వీధి, లింగశెట్టిపాళ్యం, మార్కెట్ ఏరియా, సిద్దయ్యగుట్ట, యాదవ వీధి, బ్రాహ్మణవీధి, లోనికోట, బోయవీధి, జేజేఆర్ నగర్, ఇందిరానగర్, సాయినగర్, ఎర్రగుంట సర్కిల్, ప్రియాంకనగర్‌లలో రెండు రోజులు తాగునీటి సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. పైపులైను షిఫ్టింగ్ పనులు పూర్తయిన వెంటనే నీటి సరఫరా కొనసాగిస్తామని, ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు.